క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న 36 మంది విద్యార్థులకు శుక్రవారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థులైన చింతా సుబ్బారెడ్డి, కందూరి సాంబశివ రూ.6 వేల విలువైన పరీక్ష సామగ్రి కిట్లు అందజేశారు. వీటిలో పరీక్ష అట్ట, పెన్, పెన్సిల్ తదితర వస్తువులు ఉన్నాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను అభినందించారు.

నేటి నుంచి పీ 4 సర్వే

పెదపూడి: మండలంలోని శనివారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు పీ4 (పబ్లిక్ - ప్రైవేటు - పీపుల్ - పార్టనర్ షిప్) సర్వే నిర్వహించనున్నారని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్ర రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం సచివాలయ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా పేద కుటుంబాలకు మద్దతుగా నిలిచేందుకే పీ 4 సర్వే చేస్తున్నామన్నారు. పేదల అవసరాలను గుర్తించి, వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఈ సర్వే దోహదం చేస్తుందన్నారు. ఈ సర్వేలో సేకరించిన డేటా ఆధారంగా ఇంటి అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళికల రూపకల్పనకు వీలవుతుందన్నారు. సచివాలయం కార్యదర్శులు, ఇతర అధికారుల ఈ సర్వేను నిబంధనల ప్రకారం చేపట్టి, సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బిక్కవోలు: నేటి నుంచి పేదలపై సర్వే చేయాలని పందలపాక పంచాయతీ కార్యదర్శి రొంగల శ్రీలక్ష్మి అన్నారు. ఆ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆమె సచివాలయం సిబ్బందితో మాట్లాడారు. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య సర్వే (పీ 4 సర్వే)పై మరింత అవగాహన కల్పించారు. మండల ఎంపోటీ, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సూరిశెట్టి సురేష్ మాట్లాడుతూ సర్వేలో 27 రకాల ప్రశ్నావళి ఉంటుందని, ఇంటింటికి వెళ్లి ఈ సర్వే చేయాలని తెలిపారు.

18 మంది విద్యార్థుల గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రంలో శుక్రవారం ద్వితీయ సంవత్సరం లెక్కలు 2-ఎ, బోటనీ పేపర్ 2, సివిక్స్ పేపర్ 2 పరీక్షలు జరిగాయి. ఈ వీటికి 486 మంది హాజరు కావాల్సి ఉండగా ఏ సెంటర్‌లో 15, బి సెంటర్‌లో 3 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు.

గోదావరి ఘాట్ల పరిశీలన



పురుషోత్తపట్నంలో ఆవను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

సీతానగరం: మండలంలోని పలు గోదావరి ఘాట్ల (రేవులు)ను కేంద్రం నుంచి వచ్చిన సిద్ధన్ రవీంద్ర బృందం శుక్రవారం పరిశీలించింది. ములకల్లంక, మునికూడలి, పురుషోత్తపట్నంలో వీరు పర్యటించారు. ఈ బృందం వెంట రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, రుడా అధికారులు ఉన్నారు. 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా అభివృద్ధి చేయాల్సిన ఘాట్లను పరిశీలించి కేంద్రానికి నివేదిక అందించనున్నారు.

ఘనంగా అన్నసమారాధన

సీతానగరం: వెలమపేటలోని ధనదుర్గ అమ్మవారి జాతర సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. అర్చకుడు దత్తుడు ఆధ్వర్యంలో ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనకు సుమారు ఐదువేల మంది భక్తులు హాజరయ్యారు.

నరసింహస్వామికి వస్త్రాల సమర్పణ



అన్నవరం ఈవో సుబ్బారావుకు వస్త్రాలను అందజేస్తున్న తుమ్మిడి బాబ్జీ

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా స్వామివారికి రాజమహేంద్రవరానికి చెందిన తుమ్మిడి బ్రదర్స్ సుమారు రూ.50 వేల విలువైన వస్త్రాలను శుక్రవారం అందజేశారు. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు, నరసింహస్వామి ఆలయ అనువంశిక ధర్మకర్త రంగరాజ బట్టర్, ఆలయ అర్చకస్వామి చంటిబాబులకు వీటిని అందజేశారు.

మగువలు.. మహారాణులు

- అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- విజయపథాన పయనం
- ఇతరులకు స్ఫూర్తిదాయకం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మండారపు సీతారత్నం, ఎంపీపీ, రాజానగరం



ఉల్లి వీరవెంకటసత్య సూర్యకుమారి, ఎంపీపీ, కోరుకొండ



రాజానగరం: ఆకాశంలో సగం, అవనిలో సగం అంటూ అన్ని రంగాలలోనూ పురుషులతో పోటీపడుతూ ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో మహిళలు దూసుకుపోతున్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమన్నట్టుగా వివక్షతకు గురైన మహిళలు.. నేడు అందరినీ శాసించే స్థాయిలో పదవులను అందుకుంటున్నారు. సమాజానికి దిశ, దశను నిర్దేశించే రీతిలో ఉన్నత స్థాయి అధికారులుగా కూడా రాణిస్తున్నారు. ఇదే క్రమంలో రాజానగరం నియోజకవర్గంలో ముఖ్యంగా రాజానగరం మండలంలో గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పరిపాలనాపరంగా ఎక్కువ మంది మహిళలే కార్యనిర్వాహకులు కావడం విశేషం.

మూడు మండలాల పీఠాలు మహిళలవే

నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులుగా మహిళలే అధికారంలో ఉన్నారు. రాజానగరం, కోరుకొండ మండలాల నుంచి అప్పటి వరకు గృహిణులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మండారపు సీతారత్నం, ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపీపీలుగా ఎన్నికయ్యారు. అయితే వీరి భర్తలు అప్పటికే రాజకీయంగా పలు పదవులు చేసి ఉండటంతో మహిళా రిజర్వేషన్ ద్వారా వచ్చిన అవకాశాన్ని వీరు సద్వినియోగం చేసుకున్నారు. ఇక సీతానగరం మండలం నుంచి గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గుర్రాల జ్యోత్స్న ఆ మండల ప్రజా పరిషత్‌కు అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. రాజకీయంగా నేపథ్యం లేనప్పటికీ వైఎస్సార్ సీపీ ప్రభావం ఆమె విజయానికి పూలబాట వేసింది. రాజానగరానికి చెందిన కొల్లి సత్య మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రధాన అధికారులందరూ మహిళలే..

నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో ప్రధాన అధికారులందరూ మహిళలే. ఎంపీడీఓగా జేపీ ఝాన్సీ, తహసీల్దార్‌గా జీఏఎల్ఎస్ దేవి, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం సీడీపీఓగా టి.నాగమణి, మండల ఈఓపీఆర్డీగా వై.వాణి, ఐకేపీ కార్యాలయం ఏపీఎంగా సునీత విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే డిప్యూటీ తహసీల్దారు (ఎలక్షన్) ఎ.కుమారి, సర్వే విభాగం డీటీగా బి.శాంతి, ఆర్ఐగా ఆర్‌కే రంభ, మండల సర్వేయర్‌గా ఈ.అనిత విధులు నిర్వర్తిస్తున్నారు. వీరితో పాటు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఉపాధ్యాయులలో కూడా మహిళలు సమర్థవంతమైన ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

పంచాయతీరాజ్ శాఖలోనే ..



గ్రూప్ - 3 పరీక్షల ద్వారా పంచాయతీరాజ్ శాఖలో గ్రామాభివృద్ధి అధికారి (వీడీఓ)గా 1993 డిసెంబర్‌లో రాజానగరం మండలంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టాను. అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం ఇదే మండలంలో ఈఓపీఆర్డీగా వర్క్ చేస్తున్నాను. బీఏ చదివిన తరువాత ఉద్యోగాన్వేషణలో ఉండగా గ్రూప్ - 3 నోటిఫికేషన్ పడటంతో దరఖాస్తు చేసి, ఉద్యోగం పొందాను. వీడీఓగా రాజానగరం, సీతానగరం మండలాలలో పనిచేశాను. ఆ తర్వాత 2002లో పంచాయతీ కార్యదర్శిగా చక్రద్వారబంధం, కానవరం, పాతతుంగపాడులలో పనిచేశాను. 2018లో ఈఓపీఆర్డీగా పదోన్నతి పొంది కడియం మండలంలో విధులు నిర్వహించాను. 2024 ఎన్నికల తరువాత రాజానగరం మండలానికి వచ్చాను.

– వై.వాణి, ఈఓపీఆర్డీ, రాజానగరం

ఉపాధ్యాయురాలి నుంచి ఎంపీడీఓగా..



ఎమ్మెస్సీ, ఎంఈడీ, ఎంఏ, బీఎల్ చదివాను. రాజానగరం మండలం కొండగుంటూరు ప్రభుత్వ పాఠశాలలో 1996లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగంలో చేరాను. ఎనిమిదేళ్ల తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా జొన్నాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలకు బదిలీ అయింది. తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే కావడంతో మొదట ఆ వృత్తిని ఎంచుకున్నాను, కానీ సర్వీసు చేయడానికి పోటీ పరీక్షలకు ప్రిపేరై, 2007లో ఏపీ సర్వీసు కమిషన్ ద్వారా ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించాను.

– జేప ఝాన్సీ, ఎంపీడీఓ, రాజానగరం

అందరూ ఉపాధ్యాయులే..



పుట్టిళ్లు, అత్తింటి వారందరూ ఉపాధ్యాయులే, నా భర్త కూడా ఉపాధ్యాయుడే కావడంతో ఆ క్రమంలో నేను కూడా స్కూల్ టీచర్‌ని కావాలని ఎంఏ, బీఈడీ చేశాను. డీఎస్సీలో మొదటి ప్రయత్నం ఫలించలేదు. ఇంతలో 2007లో రెవెన్యూ శాఖలో నోటిఫికేషన్ పడటంతో దరఖాస్తు చేసి, పరీక్ష రాస్తే, అదే ఏడాదిలో బిక్కవోలు మండలానికి డిప్యూటీ తహసీల్దారుగా ఉద్యోగంలో చేరాను. 2013లో తహసీల్దారుగా పదోన్నతి పొందాను. అనపర్తిలో రెండుసార్లు, రాజానగరంలో ఒకసారి పనిచేసి, ప్రస్తుతం ఇన్‌చార్జిగా రెండో పర్యాయం పనిచేస్తున్నాను.

– గరగ అనంతలక్ష్మి సత్యవతీ దేవి, తహసీల్దార్, రాజానగరం

డాక్టరు కావాలనుకున్నాను



మాది పశ్చిమగోదావరి జిల్లా మంచిలి గ్రామం. సోషియాలజీ, హిస్టరీ సబ్జెక్టులతో రెండు ఎంఏలు చేశాను. ఇంటర్ వరకు సైన్స్ సబ్జెక్టు చదివాను. అప్పుడు డాక్టర్ అవుదామనుకునేదాన్ని. అయితే ఆ సమయంలోనే వివాహం చేయడంతో నా లక్ష్యం వైపు పయనం సాగలేదు. చదువుకు కూడా ఆగిపోయింది. అయితే చదువుపై ఉన్న ఆసక్తి కొద్దీ ప్రైవేట్‌గానే ఎంఏలు చేశాను, ఏపీ సర్వీసు కమిషన్ ద్వారా 1993 మే లో గ్రేడ్ 1 సూపర్ వైజర్‌గా కోరుకొండలో ఉద్యోగంలో చేరాను. 2012లో సీడీపీఓగా పదోన్నతి పొందాను. శంఖవరం, పెరవలి, అడ్డతీగలలో చేసి ప్రస్తుతం రాజానగరంలో విధులు నిర్వర్తిస్తున్నాను.

– టి. నాగమణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ, రాజానగరం

వలంటీర్ నుంచి ఎంపీపీ



సీతానగరం మండలం ముగ్గళ్లకు చెందిన నేను గ్రామ వలంటీర్‌గా పనిచేసి వైఎస్సార్ సీపీ ఎంపీపీగా పదవిని అధిరోహించాను. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత జీఎస్ఎల్ క్యాన్సర్ ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పని చేశాను. నా భర్త కృష్ణారావు శ్రీచైతన్యలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ వలంటీర్‌గా చేరాను. ఎంపీటీసీగా వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసి గెలుపొంది, ఎంపీపీ పగ్గాలు చేపట్టాను. మా మావయ్య పంచాయతీ వైస్ ప్రెసిడెంట్‌గా, ప్రెసిడెంట్‌గా పని చేశారు. ఆయన స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చాను. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సహాయ, సహకారాలతో గెలుపొందాను.

– గుర్రాల జ్యోత్స్న, సీతానగరం ఎంపీపీ

పోరాటాలతోనే హక్కులు సాధించుకోవాలి



సింగంపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

రంగంపేట: పోరాటాల ద్వారానే మహిళలు తమ హక్కులను సాధించుకోవాలని ఏపీ ఆర్‌సీఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతి శీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సింగంపల్లిలో మహిళలు ప్రదర్శన నిర్వహించారు. స్త్రీ విముక్తి జిల్లా నాయకులు నర్ల లక్ష్మీదేవి అధ్యక్షత సీపీ రెడ్డి నగర్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ అనేక మంది త్యాగం, పోరాటం ఫలితంగా మహిళలు సాధించుకున్న హక్కులను దేశంలో నేడు పాలక వర్గాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. బీజేపీ పాలనలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు, అకృత్యాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. అనేక రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు రక్షణ లేదన్నారు. సీపీ రెడ్డి నగర్ వాసులకు ఇంటి పట్టాలను మంజూరు చేసి, మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు, కడితే సతీష్, షేక్ మురాంబీ, తలుపులమ్మ, మౌనిక, చెక్క పద్మ పాల్గొన్నారు.



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలు అలేఖ్యను సన్మానిస్తున్న లెక్చరర్లు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అధ్యక్షతన శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవ జాతి మనుగడకు మూలమైన మహిళలను ఎల్లప్పుడూ గౌరవించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరేరామకృష్ణ మాట్లాడుతూ సృష్టిలోని జీవశక్తి స్త్రీమూర్తి అని, ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో, అక్కడ దేవతలు సంతోషిస్తారని కొనియాడారు. అధ్యాపకురాలు డాక్టర్ ఎం.సుధామయి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందంజ వేయాలన్నారు. స్లోగన్ రచన - పఠనం పోటీల్లో విజేతలుగా నిలిచిన దివ్య, రాణి, స్ఫూర్తికి బహుమతులు అందించారు. కళాశాలకు చేస్తున్న సేవలకు గాను గణిత అధ్యాపకులు ఎం.అలేఖ్యను ఘనంగా సన్మానించారు. అలాగే సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపిడీవో ఎం.భారతి, డీటీ ఎం.సునీత, ఏపీవో కె.నాగ శేషవేణి పాల్గొన్నారు.

కక్ష సాధించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- 12న ఫీజు పోరును విజయవంతం చేయాలి
- గాదరాడలో 'నా కార్యకర్తలు – నా కుటుంబం'



గాదరాడలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కక్ష సాధింపు చర్యల ద్వారా ప్రతిపక్ష పార్టీని అణచివేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని, దానిలో భాగంగా రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గాదరాడలోని చిర్ల రాంబాబు ఇంటి వద్ద శుక్రవారం రాత్రి ' నా కార్యకర్తలు - నా కుటుంబం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది నెలల కూటమి ప్రభుత్వ పాలనలో పేద వర్గాలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రజల కష్టాలను పట్టించుకున్న నాథులే లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు జరపడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే లక్షణం కేవలం మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యకర్తలకు ఎటువంటి కష్టాలొచ్చినా తాను వెన్నంటే ఉంటానన్నారు. ఈ నెల 12వ తేదీన జరిగే వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పాల్గొనాలన్నారు. అదే రోజు నిర్వహించే ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు అడపా కనకరాజు, నాయకులు నక్కా రాంబాబు, అడబాల చినబాబు, గణేశుల పోసి, కడియాల పాపారావు, చిర్ల శివాజీ, గొల్లవిల్లి అశోక్, తోరాట శ్రీను పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి



సిబ్బందితో సమావేశమైన డీఎల్‌పీఓ నాగలత

రాజానగరం: ఇంటి పన్ను వసూలును వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగలత సిబ్బందికి సూచించారు. ఇంటి పన్ను వసూలు మందకొడిగా ఉన్న దివాన్‌చెరువు పంచాయతీ పరిధిలో ఈఓపీఆర్డీ వై.వాణితో కలిసి శుక్రవారం ఆమె పర్యటించారు. అనంతరం గ్రామ సచివాలయాల సిబ్బందితో సమావేశమై, వసూలును వేగవంతం చేసేందుకు అనుసరించాల్సిన మార్గాలను వివరించారు. వారంలో ఒక రోజు గ్రామంలో మకాం వేసి, వసూలుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం చెత్త నుంచి సంపదను సృష్టించే కేంద్రాన్ని పరిశీలించారు.

రంగంపేట భవిత కేంద్రం పరిశీలన



రంగంపేట భవిత కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కన్నబాబు

రంగంపేట: జిల్లా వ్యాప్తంగా 254 మంది ప్రత్యేకావసరాలు గల విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారని జిల్లా ఐఈఆర్‌టి కో ఆర్డినేటర్ ఎస్.కన్నబాబు తెలిపారు. రంగంపేట భవిత కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కేంద్రం నుంచి ఏడుగురు పత్యేక అవసరాలు గల విద్యార్థులు పరీక్షలు రాయడానికి కృషి చేసిన ఐఈఆర్‌టీ ఎంవీఎస్ ప్రసాద్, అంజలిలను ఆయన అభినందించారు. విద్యార్థులు చేస్తున్న ప్రాజెక్టు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల కృషిని అభినందిస్తూ రాజానగరం ఎంఈఓ -2 జి.జ్యోతిప్రసాద్ మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో రంగంపేట ఎంఈఓ -2 పి. మధుసూదనరావు, సీఆర్ఎంటీలు ఎల్. శ్రీనివాసరాజు, దుర్గారావు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట: గురుకుల విద్యాలయాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు లక్ష్మీ నరసాపురం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మణ కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 21 గురుకులాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ (ఇంగ్లిషు మీడియం)లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ నెల 13వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలి



తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

మధురపూడి: ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం ఆర్డీఓ కృష్ణ నాయక్‌తో కలిసి శుక్రవారం కోరుకొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రీసర్వే ప్రక్రియ చేపట్టడంతో ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా రీసర్వేకి సంబంధించిన 924 అర్జీలను కోరుకొండ మండలంలో పరిష్కారం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.సుస్వాగతం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి



నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: మండల గ్రామాల్లో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న నీటిని తొలగించారు. సీతానగరంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు మాట్లాడుతూ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ లేకుండా చూసుకోవడం వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా వ్యాధులకు కారణమయ్యే దోమలను వృద్ధి చెందకుండా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం ఎస్‌కే మున్నీషా, ఆశావర్కర్ దేవి పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సమష్టి కృషి



నవోదయం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మధురపూడి: సారాను నిర్మూలించినప్పుడే ప్రజల ఆరోగ్యానికి రక్షణ లభిస్తుందని రాజమహేంద్రవరం ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.శివ ప్రసాద్ అన్నారు. గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామంలో శుక్రవారం నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినీషా, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నూకరాజు, కోరుకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాస బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏటిగట్టు రోడ్లను అభివృద్ధి చేయాలి



ధనదుర్గ అమ్మవారి సన్నిధిలో వీరన్న చౌదరి

సీతానగరం: ప్రజల సౌకర్యార్థం రాజమహేంద్రవరం నుంచి పురుషోత్తపట్నం వరకు ఉన్న ఏటిగట్టు రోడ్లను బాగు చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి డిమాండ్ చేశారు. సీతానగరం వెలమపేటలోని ధనదుర్గ అమ్మవారిని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వరకు రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. దాన్ని సిమెంట్ లేదా తారురోడ్డుగా అభివృద్ధి చేయాలన్నారు. సీతానగరం నుంచి రాజమహేంద్రవరం రోడ్డుకు ప్రత్యామ్నాయంగా ఏటిగట్టు రోడ్డును అభివృద్ధి చేయాలన్నారు. రాజమహేంద్రవరం నుంచి పురుషోత్తపట్నం వరకు ఏటిగట్టు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎంపీ పురందరేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరిలకు వినతిపత్రం అందిస్తానని తెలిపారు.